సాక్షి మంచిర్యాల

బుధవారం ၊ 1 ၊ అక్టోబర్ ၊ 2025



మార్గ సూచి.. ప్రయోజనకారి
పాఠశాలల్లో అకడమిక్ క్యాలెండర్ పంపిణీకి విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. బోధన, పరీక్షలు, సెలవులు, సాంస్కృతిక కార్యక్రమాల షెడ్యూల్ పొందుపర్చింది. 10లో▸



పారిశుద్ధ్యం అస్తవ్యస్తం
జన్నారం మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. రోడ్లు గుంతలుపడి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 11లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /25.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

ఎన్నికల విధుల్లో మినహాయింపు ఇవ్వాలి

మంచిర్యాలఅర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో గర్భిణులు, పాలు ఇచ్చే తల్లులు, దివ్యాంగులు, అనారోగ్యం, ఉద్యోగ విరమణకు దగ్గర ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, రాజావేణు మాట్లాడుతూ కొందరు ఉపాధ్యాయులు బతుకమ్మ, దసరా పండుగలకు స్వగ్రామాలు, దూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణకు హాజరు కాలేకపోతున్నారని తెలిపారు. వారికి పండుగ తర్వాత శిక్షణ ఇవ్వాలని, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి వసతులు కల్పించాలని కోరారు.

ఏరియాలో 56శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న జీఎం రాధాకృష్ణ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో సెప్టెంబర్‌లో 56 శాతం బొగ్గు ఉత్పత్తి చేశామని ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. కేకే–5 గనిలో 17,181 టన్నులు, కాసిపేట గనిలో 12,708 టన్నులు, కాసిపేట–2 గనిలో 11,968 టన్నులు, శాంతిఖనిలో 5,424 టన్నులు, కేకే–ఓసీలో 67,838 టన్నులు బొగ్గు ఉత్పత్తి సాధించామని తెలిపారు. అధిక వర్షాల వల్ల లక్ష్యాన్ని చేరుకోలేకపోయామని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏరియాకు సంస్థ నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యంలో 60శాతం బొగ్గు ఉత్పత్తి చేశామని, గైర్హాజరు కార్మికులు విధులకు హాజరై బొగ్గు ఉత్పత్తికి సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్వోటు జీఎం విజయప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, డీజీఎం వీఎస్ఆర్కే ప్రసాద్, సీనియర్ పీవో బొంగోని శంకర్, ఎస్‌ఈ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి చండిపూజ



పూజల్లో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథ ఆలయ కాలక్షేప మండపంలో సర్వజననీ దుర్గాదేవి నిర్వాహక మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి వద్ద మంగళవారం చండిపూజ ఘనంగా నిర్వహించారు. అంతకుముందు తొమ్మిది కలశాల పూజ, 108 తామర పూలు, 108 దీపాలు వెలిగించారు. దుర్గాష్టమి కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల బెంగాలీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాజీ మంత్రి బోడ జనార్దన్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, హైకోర్టు ఏజీపీ సైదం లక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్వజననీ దుర్గాదేవి నిర్వాహక మండలి అధ్యక్షుడు బోడ ధర్మేందర్, ఉమ్మడి జిల్లా ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్వీ రమణ, కమిటీ సభ్యురాలు రీనారాణి దాస్, అత్తి సరోజ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



ముల్కల్లలో పూజలో పాల్గొన్న భక్తులు

జైపూర్/జన్నారం/మంచిర్యాలరూరల్(హాజీపూర్): శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జైపూర్ ఎస్టీ కాలనీలో చండీయాగం నిర్వహించారు. జన్నారం మండలంలోని కవ్వాల్‌లో అమ్మవారికి ఊరంతా బోనాలు సమర్పించారు. హాజీపూర్ మండలం గుడిపేట 13వ బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన దేవి మండపంలోని దుర్గాదేవిని కమాండెంట్ వెంకటరాములు–పద్మ దంపతులు దర్శించుకున్నారు.

రిజర్వేషన్ల పంచాయితీ

- ఒక్క ఓటరూ లేని వర్గాలకు అవకాశాలు
- పోటీ చేసే వారే లేరని స్థానికుల ఆందోళన
- కేటగిరీలు మార్చాలని డిమాండ్లు
- ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లలో విచిత్రం



రిజర్వేషన్ మార్చాలంటూ ధర్నా చేస్తున్న దస్తురాబాద్ మండలం పెర్కపల్లి గ్రామస్తులు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల పంచాయితీ మొదలైంది. పలు గ్రామాల్లో పోటీలో నిలబడేందుకు అభ్యర్థులే లేని పరిస్థితి నెలకొంది. దీంతో తమ గ్రామాల్లో రిజర్వేషన్ల ఖరారుపై పునః పరిశీలన చేయాలని విన్నవిస్తున్నారు. కొన్ని చోట్ల స్థానికులు నిరసన వ్యక్తం చేస్తూ న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులను కలుస్తూ రిజర్వేషన్లు మార్చాలని కోరుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత మార్చే అవకాశం లేకపోవడంతో ఆ గ్రామాల్లో ఎన్నికలు జరుగుతాయా..? లేదా..? అనే సందిగ్ధత నెలకొంది.

ఎందుకీ పరిస్థితి?

2011 నాటి జనాభా లెక్కలతో ఎస్సీ, ఎస్టీ వర్గాలు, రాష్ట్రంలో నిర్వహించిన సామాజిక ఆర్థిక కుల గణన సర్వేను పరిగణనలోకి తీసుకుని బీసీలకు రిజర్వేషన్ల ర్యాంకింగ్ ఇచ్చారు. బీసీ వర్గాల రిజర్వేషన్లకు డెడికేషన్ కమిషన్ సిఫారసులు పరిగణనలోకి తీసుకున్నారు. రాష్ట్రంలో 2019 తర్వాత ఇప్పుడు జరుగుతున్న రెండో స్థానిక సంస్థల ఎన్నికలు, సర్పంచ్, ఎంపీటీసీ మండలం యూనిట్‌గా, జెడ్పీటీసీ జిల్లా యూనిట్‌గా ర్యాంకింగ్‌లు ఇచ్చే క్రమంలో ఆయా వర్గాల్లో జనాభా లేనప్పటికీ రిజర్వేషన్లు ఇవ్వాల్సిన అనివార్యత ఏర్పడింది. ఇక మహిళలకు 50శాతం, వంద శాతం ఎస్టీలు ఉన్న చోట్ల వారికే నోటిఫై చేయడం వంటి నిబంధనలు పాటించాల్సి ఉంది. ఎస్టీ, ఎస్సీ, బీసీల ర్యాంకింగ్ ఇచ్చే క్రమంలో ఒక్క ఓటరు లేని వర్గాలకు కూడా ఆయా చోట్ల రిజర్వేషన్లు ప్రకటించాల్సి వచ్చింది. ఇక గత ఎన్నికల్లో ఏదైనా కారణంతో ఎన్నిక జరగకపోతే ఆయా వర్గాలకు కేటాయించిన రిజర్వేషన్లు అనుభవించని కారణంగా మరోసారి వారికే అవకాశం కల్పించేలా జీవో జారీ చేశారు. ఇక షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజనులే పోటీకి అర్హులు. దీంతో ఏ గ్రామంలోనైనా గిరిజనులు ఉన్నా లేకున్నా వారికే అవకాశాలు వస్తున్నాయి. గతంలో జనాభా లెక్కల సమయంలోనూ కొన్ని చోట్ల ఆయా వర్గాల వివరాల నమోదులో తప్పిదాలు జరగడంతోనూ ఇబ్బందులు వస్తున్నాయి. మళ్లీ జనాభా లెక్కలు జరిగి, ఆయా వర్గాల వివరాలు స్పష్టత వచ్చే వరకు ఈ పరిస్థితి మారే అవకాశం లేదు.

ఉప సర్పంచ్‌లకే పగ్గాలు

సర్పంచ్ పదవులు ఆయా వర్గాలకు రిజర్వు కావడంతో వార్డు స్థానాలకు ఎన్నిక జరిగే అవకాశం ఉంటుంది. దీంతో వార్డు సభ్యులు తమలో ఒకరిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకుంటున్నారు. దీంతో సర్పంచ్ ఎన్నిక జరగని చోట్ల రిజర్వేషన్ వర్తించని ఉప సర్పంచ్‌లే సర్పంచ్ హోదాలో పాలన కొనసాగించే అవకాశం ఉంది.

జనాభా లేకున్నా అవకాశాలు

- దస్తురాబాద్ మండలం పెర్కపల్లెలో 554 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో నలుగురు ఎస్టీ ఓటర్లు ఉండగా, మిగతా వారంతా బీసీలే. ఇక్కడ ఎస్సీలు లేరు. కానీ సర్పంచ్ అభ్యర్థిగా ఎస్సీ రిజర్వేషన్ ఖరారైంది.
- కుభీర్ మండలం ఫకీర్‌నాయక్ తండా, దావూజీ నాయక్ తండాలో గిరిజనులే ఉండగా, ఇక్కడ బీసీ రిజర్వేషన్ కేటాయించారు.
- పెంబి మండలం వేణునగర్‌లో అందరూ గిరిజనులే ఉండగా, బీసీ జనరల్ రిజర్వేషన్ వచ్చింది.
- 2019లో వేమనపల్లి మండలం రాజారం గ్రామం ఎస్సీ రిజర్వు కాగా, అక్కడ ఎస్సీలు ఎవరూ లేక ఎన్నిక జరగలేదు. తాజాగా ఎస్సీలకే కేటాయించారు. ఇక కల్లంపల్లి(ముక్కిడిగూడెం) పరిధిలో ఎస్సీ, ఎస్టీలు తప్ప బీసీలు లేరు. కానీ ఇక్కడ బీసీకి కేటాయించారు.
- బెజ్జూరు మండలం తుమ్మలగూడలో పూర్తిగా ఎస్సీలే ఉండగా, ఇక్కడ బీసీ జనరల్ రిజర్వు అయింది.
- నేరడిగొండ మండలం సావర్గం, పీచర, ఆరేపల్లి పరిధిలో బీసీ రిజర్వేషన్ వచ్చింది. అయితే ఇక్కడ బీసీలు ఒక్కరూ లేరు.
- దండేపల్లి మండలం గూడెం గిరిజన ఏజెన్సీ గ్రామం. ఎస్టీలకే సర్పంచ్, వార్డు స్థానాలు రిజర్వు ఉన్నా గిరిజన జనాభా లేక గత 40ఏళ్లుగా సర్పంచ్ ఎన్నిక జరగడం లేదు. తాజాగా ఎస్టీ జనరల్‌కు అవకాశం వచ్చింది. ఇదే మండలం నెల్కివెంకటాపూర్ నుంచి వందర్‌గూడను వీడి కొత్తగా పంచాయతీ ఏర్పాటు చేసి ఎస్టీకి కేటాయించారు. నెల్కివెంకటాపూర్ ఏజెన్సీ పరిధిలో కావడంతో ఎస్టీలకు రిజర్వు కావడంపై స్థానికుల నుంచి అభ్యంతరాలతో ఎన్నికలు జరగడం లేదు.
- సారంగాపూర్ మండలం హనుమాన్ తండాలో 546 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 12 మంది ఎస్సీ ఓటర్లు ఉన్నారు. బీసీ ఓటర్లు ఎవరూ లేరు. పెండల్‌దరి గ్రామంలో 486 మంది జనాభాతో 233 మంది ఎస్టీ ఓటర్లు ఉన్నారు. ఇక్కడ కూడా బీసీ ఓటర్లు లేరు. ఈ గ్రామాలు పూర్తిగా ఎస్టీ జనాభా ఆధారితమై ఉండగా, రిజర్వేషన్ జాబితాలో బీసీలకు కేటాయించారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వర్తించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, పాల్గొన్న అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: పంచాయతీ ఎన్నికల్లో నోడల్ అధికారులు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నోడల్ అధికారులు, ఎంపీడీవోలతో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో తహసీల్దార్ ఆధ్వర్యంలో నియమావళి అమలు చేపట్టాలని, రాజకీయ పార్టీలు, అభ్యర్థుల సభలు, సమావేశాలకు అనుమతి జారీ చేస్తారని, సమాచారాన్ని ఖర్చుల పర్యవేక్షణ బృందానికి అందిస్తే పరిశీలన చేస్తారని తెలిపారు.

నియమావళి పాటించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల ప్రవర్తన నియమావళి కచ్చితంగా పాటించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులకు పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ నుంచి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు నోటిఫికేషన్, నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫొటో ఓటరు స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు వంటి ప్రతీ అంశంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశాల్లో డీసీపీ ఏ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జెడ్పీ సీఈవో గణపతి, జిల్లా విద్యాధికారి యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, శిక్షణ నోడల్ అధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు 72 గంటల్లో తొలగించాలి

జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, 48 గంటల్లో పబ్లిక్ ప్రాంతాలు, 72 గంటల్లో పూర్తిగా రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సంబంధిత అంశాలు తొలగించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగే విధంగా ఎన్నికల అధికారులు విధులు నిర్వర్తించాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రం మార్చాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కోటపల్లి: మండలంలోని సిర్సా గ్రామ పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏటా ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రం మార్చాలని, లేనిపక్షంలో ఎన్నికలు బహిష్కరిస్తామని గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ రాఘవేందర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో పోలింగ్ కేంద్రం కారణంగా డబ్బు, మద్యం బెదిరింపులతో కొంతమంది ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికల్లోనూ దాడులు, కేసులు నమోదైన సంఘటనలు జరిగాయని గుర్తు చేశారు. గ్రామస్తుల ఏకగ్రీవ నిర్ణయాలన్నీ తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. రాబోయే ఎన్నికల్లో గ్రామస్తులు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దింటి పున్నం, హరీశ్‌రెడ్డి, సంపత్, మహేశ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు బిల్లులు పెండింగ్

- ఏడాదిగా అందని డీఏ, టీఏ, పీఆర్సీ, ఏరియర్స్
- ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు బకాయి

మంచిర్యాలక్రైం: శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పోలీసులు బిల్లుల పెండింగ్‌తో సతమతం అవుతున్నారు. గత ఏడాదిగా డీఏ, టీఏ, ఏరియర్స్, పీఆర్సీ, సరెండర్ లీవ్స్ బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల స్కూల్ ఫీజులు, దసరా పండుగకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది వినతులను పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది.

జిల్లాకు రూ.10కోట్లు

ప్రభుత్వ ఉద్యోగికి డీఏ, టీఏ, పీఆర్సీ, ఏరియర్స్ వారి బేసిక్ పేమెంటును బట్టి ఇవ్వాల్సి ఉంటుంది. గత ఏడాది నుంచి పోలీసు శాఖలో పెండింగ్ బిల్లులు రావడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండగా.. జిల్లాకు సుమారు రూ.10కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 26 పోలీసుస్టేషన్లు, 10 సర్కిళ్లు, 950 మంది పోలీసు సిబ్బంది, ఒక డీసీపీ, ముగ్గురు ఏసీపీలు ఉన్నారు. కానిస్టేబల్ స్థాయి ఉద్యోగికి సుమారు రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు రావాల్సి ఉంది. ఇక పై అధికారులకు ఎంత రావాల్సి ఉంటుందో.. ఈ లెక్కన జిల్లాలోని పోలీసు ఉద్యోగులకు సుమారు రూ.10 కోట్లకు పైగానే ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది.

ఎదురుచూపులు

తెలంగాణలో అతిపెద్ద పండుగ దసరా.. కుటుంబ సమేతంగా తల్లిదండ్రులు, సొంతింటికి వెళ్లడం, కొత్త బట్టలు కొనడం సంబరాలు ఉంటాయి. పోలీసులు మాత్రం ఈ ఆనందానికి దూరంగా ఉండాల్సి వస్తోందని కొందరు పోలీస్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అప్పులు చేసి పిల్లలకు బట్టలు కొనాల్సి వస్తోందని వాపోతున్నారు. దసరాకైనా పెండింగ్ బిల్లులు అందుతాయని ఆశతో ఎదురుచూస్తుండగా ఒక్క సరెండర్ లీవ్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఇంకా ఐదు సరెండర్ లీవులకు మోక్షం ఎప్పుడు లభిస్తుందోనని మనోవేదనకు గురవుతున్నారు.

పండుగ రోజుల్లో విధుల్లోనే..

ఏ ఉద్యోగికైనా పండుగ, వారాంతపు సెలవులు ఉంటాయి. కానీ పోలీసులు విధుల్లోనే ఉండాల్సి వస్తుంది. 2019లో రాష్ట్ర పోలీసులు శాఖ ఉన్నతాధికారులు ఎనిమిది గంటల పని విధానం, వారాంతపు సెలవులు, అదనంగా విధులు నిర్వర్తిస్తే అదనపు అలవెన్స్, ఇన్సెంటివ్‌లు కల్పించేందుకు శ్రీకారం చుట్టింది. కానీ అది మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పోలీసు పనితీరుపై ఆవేదన వ్యక్తం చేస్తూ వారాంతపు సెలవులు ఇవ్వాలని గళం విప్పారు. సెలవుల సంగతి ఏమో గానీ న్యాయబద్ధంగా రావాల్సిన డీఏ, టీఏ, ఏరియర్స్, పీఆర్సీ, సరెండర్ లీవ్స్ బిల్లులు చెల్లించాలని పోలీసులు కోరుతున్నారు.

మహిళా సంఘాలకు అద్దె బస్సుల బాధ్యత



పాతమంచిర్యాల: స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అద్దె బస్సుల నిర్వహణ బాధ్యతలు అప్పగించనుంది. ఇప్పటికే మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తోంది. తాజాగా మహిళలు మరింత ప్రగతి సాధించడానికి అద్దె బస్సులు మంజూరు చేస్తోంది. ఈ బస్సులను ఆర్టీసీ డిపోల్లో అద్దెకు ఇవ్వడం ద్వారా వచ్చిన ఆదాయాన్ని సమాఖ్యల నిర్వహణ కోసం ఖర్చు చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రతీ మండల సమాఖ్యకు ఒక బస్ చొప్పున 16 మండలాల సమాఖ్యలకు 16 బస్‌లు మంజూరు చేయాలని ప్రతిపాదించారు. ఒక్కో బస్సు ఖరీదు రూ.36 లక్షలను ప్రభుత్వం రుణంగా మండల సమాఖ్యలకు మంజూరు చేస్తుంది. లబ్ధిదారుల వాటాగా మండల సమాఖ్య సీఐఎఫ్ నిధులను వెచ్చిస్తారు. ఆర్టీసీ ద్వారా వచ్చే అద్దెను మండల సమాఖ్యల ఖాతాల్లో జమ చేస్తారు. అందులో నుంచి ప్రభుత్వం ఇచ్చిన రూ.36 లక్షల రుణాన్ని ఏడేళ్లలో 84 ఈఎంఐలుగా మండల సమాఖ్యలు ప్రభుత్వానికి సులభ వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఇప్పటికే మహిళా సంఘాల సభ్యులకు సోలార్ ప్లాంట్లు, పెట్రోల్‌బంక్‌లు మంజూరు చేయగా తాజాగా అద్దె బస్సులు కూడా మంజూరు చేసి స్వయం సహాయక సంఘాల సభ్యులను వ్యాపారవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు తెలిపారు.

ప్రతిపాదనలు పంపించాం

జిల్లాలోని మండల సమాఖ్యలకు అద్దెబస్సుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసిన తర్వాత బస్సులు కొనుగోలు చేస్తాం. మండల సమాఖ్యల పేరున హైపోథికేషన్‌తో జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో అద్దెకు ఇస్తాం.

– ఎస్.కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

నగలు.. రెండు నెలలు ఆగాల్సిందే..!

- పూర్తయిన బాధితుల వివరాల సేకరణ
- పండుగ తర్వాత పూర్తి కానున్న కోర్టు ప్రక్రియ
- ఆభరణాల కోసం బాధితుల ఎదురుచూపులు



చెన్నూర్ ఎస్‌బీఐ

చెన్నూర్: చెన్నూర్ ఎస్‌బీఐ బ్రాంచి–2లో జరిగిన కుంభకోణాన్ని ఛేదించిన పోలీసులు నగలు బ్యాంకుకు అప్పగింతకు కసరత్తు చేస్తున్నారు. గత పక్షం రోజులుగా ఎస్‌బీఐ గోల్డ్‌లోన్ బాధితుల వివరాలను సీఐ దేవేందర్‌రావు ఆధ్వర్యంలో పోలీసులు సేకరించారు. కోర్టు ద్వారా బ్యాంకుకు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేసినట్లు తెలిసింది. దసరా పండుగ తర్వాత బ్యాంకుకు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. బ్యాంకులో 20.250 కిలోల బంగారు నగలు, రూ.1.10కోట్లు నగదు అపహరణకు గురికావడం, పోలీసులు ఆభరణాలను గత నెల 12న పూర్తి స్థాయిలో రికవరీ చేయడం తెలిసిందే. వాటిని బ్యాంకులో భద్రపర్చారు. నిబంధనల ప్రకారం ఆభరణాలను కోర్టు ద్వారా బ్యాంకుకు అప్పగించాల్సి ఉంది. నగలను కోర్టుకు అప్పగించే ప్రక్రియ పూర్తి చేశారు. దసరా పండుగ తర్వాత కోర్టు ఆదేశాల మేరకు బ్యాంకు ఉన్నతాధికారుల సమక్షంలో బ్యాంకు కస్టడీకి అప్పగించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

వేరు చేయడానికి సమయం

దసరా పండుగ తర్వాత బ్యాంకుకు నగలు అందినా బాధితులకు ఇచ్చేందుకు మరో రెండు నెలలకు పైగా సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బాధితులు 402మంది ఉండడంతో రికార్డుల ప్రకారం ఎవరు ఎన్ని గ్రాముల బంగారం తాకట్టు పెట్టారు, ఏయే నగలు ఉన్నాయని వేరు చేయాల్సి ఉంటుంది. 20.250 కిలోల బంగారు నగలను బాధితుల వారీగా వేరే చేసేందుకు సమయం పడుతుందని బ్యాంకర్లు చెబుతున్నారు.

బాధితుల ఎదురుచూపులు

బ్యాంకులో నగలు తాకట్టు పెట్టి రుణం పొందిన రుణగ్రహీతలు నగలు ఎప్పుడు ఇస్తారోనని ఎదురుచూస్తున్నారు. ఆభరణాలు భద్రంగా ఉన్నప్పటికీ చేతికి వచ్చే వరకు భయం భయంగానే ఉందని బాధితుడు తిరుపతి తెలిపారు. పోలీసులు రికవరీ చేశామని ప్రకటించినప్పటికీ నగలు ఎప్పుడు ఇస్తారోనని బ్యాంకు అధికారుల నుంచి స్పష్టమైన హామీ లభించకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. కొందరు నిత్యం బ్యాంకు వద్దకు వచ్చి వెళ్తున్నారు.

కోర్టుకు అప్పగించే ప్రక్రియ సాగుతోంది..



రికవరీ చేసిన ఆభరణాలను సేఫ్టీ కోసం బ్యాంక్‌లో ఉంచాం. కోర్టు ద్వారా పూర్తి స్థాయిలో బ్యాంక్‌కు అప్పగించే ప్రక్రియ సాగుతోంది. బాధితుల వివరాలు సేకరించాం. దసరా పండుగ తర్వాత బ్యాంక్‌కు అప్పగించేందుకు ప్రయత్నిస్తాం. బాధితులకు నగలు ఎప్పుడిస్తారనే విషయం బ్యాంక్ అధికారులు బాధితులకు చెప్పే అవకాశం ఉంది. నగదు రికవరీ విచారణ కొనసాగుతోంది.

– దేవేందర్‌రావు, సీఐ, చెన్నూర్

నగరంలో పోలీసుల తనిఖీలు



మంచిర్యాలలో తనిఖీ చేస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: స్థానిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఎన్నికల నిబంధనల మేరకు మంగళవారం నగరంలోని ప్రధాన కూడళ్లలో మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. అనుమతి లేకుండా నగదు, నగలు, మద్యం తరలించొద్దని సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద

కోటపల్లి: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు సరిహద్దు ప్రాంతాలను అప్రమత్తం చేశారు. మండలంలోని పార్‌పల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనదారులు సరైన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. అక్రమంగా మద్యం, డబ్బు, ఇతరత్రా తరలింపుపై నిఘా ఉంచామని తెలిపారు.

జిల్లాలోనే క్యాన్సర్‌కు చికిత్స

- మొదటిసారి కీమోథెరపి విజయవంతం
- జీజీహెచ్‌కు అనుబంధంగా చికిత్స కేంద్రం



ఎంసీహెచ్ క్యాన్సర్ విభాగంలో వైద్యులు

మంచిర్యాలటౌన్: క్యాన్సర్ వైద్యానికి ఇకపై హైదరాబాద్ వంటి నగరాలకు పరుగెత్తకుండా ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉన్న జిల్లాలోనే క్యాన్సర్‌కు చికిత్సను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు మంచిర్యాలలో ఫలించాయి. దండేపల్లి మండలం తాళ్లపేటకు చెందిన మహిళకు ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు సంబంధించిన కీమోథెరపిని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)కి అనుబంధంగా కొనసాగుతున్న మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ సెంటర్‌లో మంగళవారం విజయవంతం చేశారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో రెండుసార్లు కీమోథెరపి నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని క్యాన్సర్ కేర్ సెంటర్‌కు పంపించారు. మూడోసారి కీమోథెరపిని జిల్లా కేంద్రంలో విజయవంతంగా మొదటిసారి చేపట్టడంతో ఇకపై జిల్లా కేంద్రంలోనే క్యాన్సర్‌కు చికిత్స అందించేందుకు అవకాశం ఏర్పడిందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రరెడ్డి తెలిపారు. జీజీహెచ్‌కు చెందిన డాక్టర్ ఆశ్లేష, ఇద్దరు నర్సింగ్ ఆఫీసర్లు ఎంఎన్‌జెలో ప్రత్యేక శిక్షణ పొందారు. ఇక్కడ కీమోథెరపిని మొదటిసారి కావడంతో ఎంఎన్‌జే ఆసుపత్రికి చెందిన కీమోథెరపి నర్సింగ్ ఆఫీసర్ దుశ్యంత్‌కుమార్ ప్రత్యేకంగా మంచిర్యాలకు వచ్చారు. గతంలో ప్రతీ సైకిల్‌కి క్యాన్సర్ రోగులు హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇకపై జిల్లాలోనే సేవలను కొనసాగించేలా సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవోలు డాక్టర్ భీష్మ, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఆశ్లేష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

తర్ణం వాగుపై కంటైనర్ బోల్తా



బోల్తా పడిన కంటైనర్

సాత్నాల: భోరజ్ మండలంలోని తర్ణం లోలెవెల్ వంతెనపై సోమవారం అర్ధరాత్రి మహారాష్ట్ర నుంచి తమిళనాడు వైపు వెళ్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ వంజన్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రాణాపాయం తప్పింది. లోలెవెల్ వంతెన నిర్మించిన నాలుగు నెలల కాలంలో ఇది ఐదో ప్రమాదం కావడం గమనార్హం. రూ.4.5 కోట్లతో తాత్కాలికంగా నిర్మించిన లోలెవెల్ వంతెనపై చిరుజల్లులు పడినా రాకపోకలు నిలిచిపోతున్నాయి.

గుడుంబా పట్టివేత

నార్నూర్: మండలంలోని భీంపూర్ గ్రామంలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన రాథోడ్ నీలాబాయి వద్ద రెండు లీటర్లు, జాదవ్ అనూష వద్ద నాలుగు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్ తెలిపారు. సిబ్బంది లింగన్న, ఆశన్న, శ్రావణ్‌కుమార్, స్రవంతి, గంగాధర్ తదితరులున్నారు.

దాడికి పాల్పడ్డ లారీ డ్రైవర్లపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్‌లోగల లారీ అసోసియేషన్ సంఘ భవనంలో మంగళవారం ఓ డ్రైవర్‌పై పలువురు డ్రైవర్లు దాడికి పాల్పడినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లారీలను వరుస క్రమంలో పెట్టలేదని దేవాపూర్‌కు చెందిన డ్రైవర్ షేక్ కలీమ్‌పై పట్టణానికి చెందిన లారీ డ్రైవర్లు సద్దాం, సలీమ్ ఖాన్, సయ్యద్ సిరాజ్ తదితరులు దాడి చేశారు. నకల్ పంచ్‌తో ఆయన ముఖంతో పాటు శరీరంలోని పలు భాగాలపై దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

టిప్పర్, హైడ్రా వాహనం ఢీ



లారీపై పడిపోయిన ఎస్కార్ట్ వాహనం

నస్పూర్: పట్టణ పరిధిలోని కలెక్టరేట్ చౌరస్తా వద్ద మంగళవారం రాత్రి జాతీయ రహదారిపై టిప్పర్ వాహనాన్ని హైడ్రా వాహనం ఢీకొట్టింది. మంచిర్యాల నుంచి శ్రీరాంపూర్ వైపు వస్తున్న హైడ్రా వాహనం కలెక్టరేట్ చౌరస్తా వద్ద యూ టర్న్ తీసుకునే సమయంలో శ్రీరాంపూర్ నుంచి మంచిర్యాల వైపునకు వెళ్తున్న టిప్పర్ లారీని ప్రమాదవశాత్తు అదుపు తప్పి ఢీకొట్టింది. హైడ్రా వాహనం ముందు భాగం టిప్పర్ డ్రైవర్ క్యాబిన్‌పై పడింది. అదృష్టవశాత్తు డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక ఎస్సై ఉపేందర్‌రావు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

నేరడిగొండలో రెండిళ్లలో చోరీ

- 3 తులాల బంగారం, రూ.70వేల నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై

నేరడిగొండ: మండల కేంద్రంలో మధుర కాలనీలోగల రెండిళ్లలో మంగళవారం తెల్లవారుజామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు కుటుంబ సభ్యులకు తెలుపడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ జావిద్ కుటుంబ సభ్యులు 15రోజుల క్రితం మహారాష్ట్రలోని వారి బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండగా వారి ఇంట్లో దొంగలు చొరబడి మూడు తులాల బంగారం, రూ.40వేల నగదు దోచుకెళ్లారు. మహ్మద్ సోఫీ కుటుంబ సభ్యులు, వారి బంధువుల ఇంటికి వెళ్లగా వారి ఇంట్లోనూ చోరీకి పాల్పడి రూ.30వేల నగదు అపహరించినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌కు చెందిన వివాహిత పింపె్ల మంగళ (52) ఆదివారం రాత్రి ఆత్మహత్యకు యత్నించగా స్థానికులు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేయగా ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో ఆమె సోమవారం రాత్రి మృతిచెందినట్లు టూటౌన్ ఎస్సై పీర్‌సింగ్ నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పదేళ్లుగా భర్తతో దూరంగా ఉంటున్న మంగళ తాటిగూడకు చెందిన బలరాం గైక్వాడ్‌తో సహజీవనం సాగిస్తోంది. ఈక్రమంలో ఆయన అనుమానంతో కొంత కాలంగా మంగళను వేధింపులకు చేస్తున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మార్గ సూచి.. ప్రయోజనకారి


- అకడమిక్ క్యాలెండర్ల పంపిణీకి శ్రీకారం
- జీవో జారీ చేసి పాఠశాల విద్యాశాఖ
- స్కూళ్లు, ఆఫీసుల్లో ప్రదర్శనకు చర్యలు
- కార్యక్రమాల అమలులో పారదర్శకతకే..

జిల్లా	పాఠశాలలు	క్లస్టర్లు	ఎమ్మార్సీలు
నిర్మల్	730	48	19
మంచిర్యాల	744	51	18
ఆదిలాబాద్	1,148	71	18
ఆసిఫాబాద్	721	62	15

నిర్మల్‌ఖిల్లా: జిల్లాల్లోని పాఠశాలల్లో అకడమిక్ క్యాలెండర్ పంపిణీకి పాఠశాల విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. విద్యాసంవత్సరానికి అనుగుణంగా రూపొందించిన ఈ క్యాలెండర్ ద్వారా బోధన, పరీక్షలు, సెలవులు, సాంస్కృతిక కార్యక్రమాలు, వార్షిక కార్యక్రమాల షెడ్యూల్ పొందుపర్చింది. విద్యాశాఖ ప్రతీ సంవత్సరం విధివిధానాల ప్రకారం క్యాలెండర్ విడుదల చేస్తూ వస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, కలెక్టరేట్, డీఈవో తదితర కార్యాలయాలు, ఆయా పాఠశాలల్లో క్యాలెండర్లను ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఈ నెల 27న ఆదేశాలు జారీ చేశారు.

కార్యక్రమాల పటిష్ట అమలుకు..

ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలో అకడమిక్ క్యాలెండర్ పేరిట మార్గ సూచిని విడుదల చేస్తున్నా పాఠశాలల్లో దీనిని అమలు చేయడంలో మాత్రం లోపాలు తలెత్తుతున్నట్లు పాఠశాల విద్యాశాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులకు మినహా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విద్యాశాఖ విడుదల చేస్తున్న అకడమిక్ క్యాలెండర్ నిర్వహణపై సరైన అవగాహన ఉండడం లేదని భావించింది. దీంతో అకడమిక్ క్యాలెండర్‌ను పోస్టర్ రూపంలో అన్ని పాఠశాలల్లో ప్రదర్శించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.



అకడమిక్ క్యాలెండర్

క్యాలెండర్‌లో ఉండే సమాచారం

ఉమ్మడి జిల్లాలో 3,343 పాఠశాలలున్నాయి. 232 పాఠశాల సముదాయాలున్నాయి. వీటన్నింటిలో జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అకడమిక్ క్యాలెండర్లను పంపిణీ చేసి ప్రదర్శించేలా అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఏ నెలలో ఏయే పరీక్షలు నిర్వహించాలి.. సిలబస్ పూర్తిచేసే సమయం, పాఠశాల సముదాయ సమావేశాలు, ప్రదర్శన పోటీలు, క్రీడలు, గ్రంథాలయాల నిర్వహణ తదితర వివరాలన్నిటినీ ఇందులో పొందుపరచబడి ఉంటాయి. ప్రధాన కార్యకలాపాలను అంశాలవారీగా రూపొందించి ఉండడంతో తదనగుణంగా అకడమిక్ క్యాలెండర్‌ను ప్రయోజనాత్మకంగా అమలుచేసే ఆస్కారం ఉంటుంది. పారదర్శకత లోపించకుండా ఉంటుంది.

విద్యా విషయక ప్రయోజనాలెన్నో..

పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రచురించిన అకడమిక్ క్యాలెండర్ల పంపిణీ ద్వారా విద్యాపరమైన ప్రయోజనాలు పూర్తిస్థాయి ప్రయోజనకరంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నారు. క్యాలెండర్ల ప్రదర్శన ద్వారా విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి కొనసాగే బడిబాట నిర్వహణ తేదీలు మొదలుకుని సెలవు దినాలు, నెలవారీ పరీక్షలు, పూర్తి చేయాల్సిన సిలబస్, ప్రాధాన్యత కలిగిన దినోత్సవాలు, తల్లిదండ్రుల సమావేశాలు, వివిధ రకాల పండుగ సెలవులు ఇందులో పొందుపరచబడి ఉంటాయి. ఇవన్నీ నెలవారీగా అమలు చేయడం, తద్వారా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా సరళతరం అవుతుందని జిల్లా విద్యాధికారి భోజన్న, విద్యా పర్యవేక్షణాధికారులు అభిప్రాయం వ్యక్తంజేస్తున్నారు.

పకడ్బందీ అమలుకు అవకాశం



ప్రింటెడ్ అకడమిక్ క్యాలెండర్లను ఆయా పాఠశాలల్లో ప్రదర్శించడం ద్వారా పారదర్శకత మరింత పెరుగుతుంది. ఉపాధ్యాయులు నెలవారీగా నిర్వహించే కార్యక్రమాల గురించి విద్యార్థులు, తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కలుగుతుంది.

– బీవీ రమణారావు, పీఆర్టీయూ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి

సముచిత నిర్ణయమే..



పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రింటెడ్ అకడమిక్ క్యాలెండర్ల పంపిణీ నిర్ణయం సముచితమైంది. ఉపాధ్యాయులు, పర్యవేక్షణ అధికారులకు సౌకర్యవంతంగా ఉంటుంది. విద్యార్థులకు కూడా పూర్తిస్థాయి ప్రయోజనం చేకూరుతుంది.

– ఎస్.భూమన్న యాదవ్, ఎస్టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు

‘బాసర’ సేవా టికెట్లపై వివరాలేవి?



భక్తుల వివరాలు లేని రూ.100 దర్శనం టికెట్లు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి వచ్చిన ఓ భక్తుడు టికెట్ కౌంటర్‌లో సోమవారం రూ.100 దర్శనం టికెట్లు నాలుగు కొనుగోలు చేశాడు. అయితే టికెట్లపై భక్తుల పేరు, ఊరు, తేదీ తదితర వివరాలు నమోదు చేయలేదు. దీంతో ఒకసారి విక్రయించిన టికెట్‌ను మళ్లీ అమ్మేందుకే ఇలా వివరాలు రాయడం లేదని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. గతంలో రూ.వెయ్యి ప్రత్యేక అక్షరాభ్యాస టికెట్‌పై భక్తుడి వివరాలు రాయకుండా దానిని మళ్లీమళ్లీ విక్రయింగా గుర్తించిన స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసిన సందర్భాలున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి చర్యలు పునరావృత కాకుండా చూడాలని కోరుతున్నారు.

బాసరలో నాలుగిళ్లలో చోరీకి యత్నం



వెంకటేశ్వరకాలనీ వాసులతో మాట్లాడుతున్న పోలీసులు



సీసీ కెమెరాకు చిక్కిన ఇద్దరు అనుమానితులు

బాసర: మండల కేంద్రంలోని వెంకటేశ్వరకాలనీలో సుమారు నాలుగిళ్లలో సోమవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించి విఫలమయ్యారు. తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యం చేసుకున్నారు. గతవారం బస్టాండ్ వద్ద గల ప్రియ మిల్క్ బేకరీతో పాటు మూడిళ్లలో చోరీ జరిగింది. వారం వ్యవధిలో దుండగులు నాలుగిళ్లలో చోరీకి యత్నించగా స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బాసరలో వరుస చోరీల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. వెంకటేశ్వరకాలనీ వాసులను అప్రమత్తం చేశారు. అనుమానితులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని బాసర ఎస్సై శ్రీనివాస్ కోరారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. ఇళ్ల ముందు సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు.

బాసరలో అర్ధరాత్రి ‘లేడీ’ హల్చల్

ముథోల్ మండల కేంద్రంలోని ఓ ఇంట్లో సోమవారం మిట్ట మధ్యాహ్నం సుమారు రూ.5లక్షల నగదు, ఐదు తులాల బంగారం చోరీ కాగా, ఈ ఘటన మరువక ముందే బాసరలో ఓ మహిళ అలజడి సృష్టించింది. ఒక వ్యక్తితో కలిసి ఆమె ఓ ఇంటి గోడ దూకి చోరీకి యత్నించగా సీసీ కెమెరాలో రికార్డయింది. పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న కొలాం సేవా సంఘం నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: అటవీ ఉత్పత్తులు, పోడు సాగుపై ఆధారపడి జీవనం కొనసాగిస్తూ ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన పీవీటీజీల అభివృద్ధి, సంక్షేమానికి పీవీటీజీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కొలాం సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రజక సంఘ భవనంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సమావేశంలో పలువురు మాట్లాడారు. అనేక ఆదివాసీ కొలాం గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. పీవీటీజీ విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ఎలాంటి నిబంధనలు లేకుండా సీట్లు కేటాయించాలని కోరారు. పోరాట యోధుడు కుమ్రం సూరు జయంతి వేడుకల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కొలాం సేవా సంఘం రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కొడప సొనేరావు, ప్రధాన కార్యదర్శిగా సిడాం రాజు, ఉపాధ్యక్షునిగా కుమ్ర రాజు, గౌరవాధ్యక్షుడిగా టేకం లక్ష్మణ్, రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలిగా కుమ్ర లక్ష్మీబాయి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్‌రావ్, నాయకులు కొడప రాము, టేకం గణేశ్, మడావి జంగు ఉన్నారు.

అడవిలో అరుదైన నక్షత్ర తాబేలు

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి అటవీ ప్రాంతంలో ప్రధాన రహదారిపై నీల్వాయి రేంజ్ అధికారి హఫీజొద్దీన్, డిప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్‌కుమార్‌కు అరుదైన నక్షత్ర తాబేలు (ఇండియన్ స్టార్ టార్టయిస్) లభ్యమైంది. ఇది బంగారు, బ్రౌన్ వర్ణంలో ఉంది. సమశీతోష్ణ వాతావరణం ఉండే మన అడవులతోపాటు పాకిస్థాన్, శ్రీలంక అడవుల్లో వీటి సంతతి ఉంటుందని అధికారులు తెలిపారు. గడ్డి, పూలు, చెట్ల ఆకులు తింటూ ఒంటరిగా జీవించే అలవాటు కలిగి ఉంటుందని పేర్కొన్నారు. సుమారు 60–80 ఏళ్ల జీవించి ఉంటుందని తెలిపారు. మగ తాబేలు కంటే ఆడ తాబేలు పెద్ద పరిమాణంలో ఉంటుందన్నారు. అటవీ చట్టం ప్రకారం దీన్ని వేటాడటం, ఇళ్లలో పెంచుకునేందుకు తీసుకెళ్లటం నేరమని తెలిపారు. జాతీయంగా ఈ తాబేలు అంతరించిపోతున్న వన్యప్రాణుల జాబితాలో ఉందని వివరించారు. ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన తర్వాత దానిని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.



నక్షత్ర తాబేలు

చిత్తగూడలో సమస్యల పరిశీలన

నార్నూర్: గ్రామ సమస్యలు పరిష్కరించకుంటే స్థానిక సంస్థల ఎన్నికలు బహిష్కరిస్తామని మండలంలోని చిత్తగూడ గ్రామస్తులు సోమవారం ఉమ్రీ వాగు వద్ద నిరసన తెలిపిన విషయం తెలిసిందే. దీనిపై ‘సమస్యలు పరిష్కరించాలి’ శీర్షికన ‘సాక్షి’లో వచ్చిన కథనానికి కలెక్టర్ రాజర్షిషా స్పందించారు. చిత్తగూడ సమస్యలపై ఆరా తీశారు. వెంటనే గ్రామానికి వెళ్లి ప్రజలతో మాట్లాడి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పీఆర్ డీఈఈ లింగన్న మంగళవారం చిత్తగూడ గ్రామాన్ని సందర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై ఉన్న చిన్న కల్వర్టుతో పాటు తెగిపోయిన రోడ్డు, వానాకాలం వస్తే రాకపోకలకు అడ్డుగా ఉన్న వాగుపై వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. 2016–17లో రూ.25లక్షలతో వంతెన నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అప్పటి పరిస్థితుల నేపథ్యంలో పనులు మధ్యలో రద్దు అయినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాగుపై వంతెన నిర్మాణానికి రూ.50లక్షలు, రోడ్డు నిర్మాణానికి రూ.30లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.



గ్రామస్తులతో వాగును పరిశీలిస్తున్న లింగన్న

పంట చేలలో గంజాయి సాగు

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- 34 మొక్కలు స్వాధీనం

సాత్నాల: గుట్టు చప్పుడు కాకుండా పంట చేన్లలో గంజాయి సాగు చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం జైనథ్ పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మండలంలోని మార్గుడా గ్రామానికి చెందిన హీరా కుమ్ర కిషన్, హీరా కుమ్ర వసంత్ తమ పంట చేన్లలో గంజాయి సాగు చేస్తున్నారనే సమాచారం రావడంతో, ఎస్సై గౌతమ్ పవర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పత్తి, కందితో పాటే కిషన్, వసంత్ గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించారు. కిషన్ చేనులో 30, వసంత్ చేనులో నాలుగు గంజాయి మొక్కలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.34 లక్షలు ఉంటుందని తెలిపారు. అక్రమంగా గంజాయి సాగు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలతో సీఐ

భూ అక్రమార్కులపై చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: భూ అక్రమార్కులపై కఠినచర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. పేదల భూములు కబ్జాకు యత్నించిన అట్రాసిటీ కేసు నిందితుడు ఉష్కం రఘుపతిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఇదివరకు అతడు పలు కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మావలకు చెందిన దళితుల భూముల స్వాధీనం, బెదిరింపు కేసులో నిందితుడైన అతడిపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మావలకు చెందిన బాధితులు ఏరే గంగన్న, ఏరే లక్ష్మి అసైన్డ్ భూములను రఘుపతికి తాకట్టు పెట్టి రూ.18లక్షలు తీసుకున్నట్లు తెలిపారు. భూములు సాగు చేసుకునేందుకు అప్పు తీర్చేందుకు వచ్చినప్పుడు నిందితుడు కొంతమందితో కలిసి అక్కడికి చేరుకుని ట్రాక్టర్‌తో తొక్కిస్తానని బెదిరింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. నిందితుడిపై ఇప్పటికే మావల పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉందని తెలిపారు. బాధితులకు న్యాయం చేయడం, శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నట్లు వివరించారు.

అమెరికాలో ‘సద్దుల’ బతుకమ్మ సంబురాలు



నార్త్ కరోలినాలో బతుకమ్మలతో మహిళలు

మామడ: బతుకమ్మ పండుగ ఎల్లలు దాటింది. ఉద్యోగాల కోసం అమెరికా వెళ్లిన తెలుగువారు ఏళ్లు గడిచినా తమ ఆచారాలు, సంస్కృతి సంప్రదాయాలను మరిచిపోలేదు. లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన దాసారం తరుణ్–మానస దంపతులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా అమెరికాలోని నార్త్ కరోలినాలో విధులు నిర్వహిస్తున్నారు. బతుకమ్మ సంబరాల కోసం గార్నర్‌గల్లీ సంఘం ఏర్పాటు చేసి ఏటా బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఆ ప్రాంత మేయర్ బడ్డీ గుప్టన్ ముఖ్య అతిథిగా హాజరై పండుగ విశిష్టత గురించి తెలుసుకున్నారు.

ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన వారిని అదనపు డీసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందిన వారంతా తమ శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని సూచించారు. ఉద్యోగ విరమణ పొందిన ఆర్.శ్రీహరి (ఆర్ఎస్సై), బీ భాస్కర్ (ఏఎస్సై), కే రమేశ్ (ఏఎస్సై), సీహెచ్ లక్ష్మయ్య (హెడ్ కానిస్టేబుల్) ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

జాతరకు ఎల్లమ్మ గుట్ట సిద్ధం

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్‌లో ఎల్లమ్మ గుట్ట జాతరకు సిద్ధమవుతోంది. ఏటా దసరా సందర్భంగా ఇక్కడ రెండ్రోజులపాటు జాతర నిర్వహిస్తారు. ఈ మేరకు గ్రామస్తులు, ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వివిధ దుకాణాలు వెలిశాయి. ఇదే గుట్టపై స్వయంభుగా చింతచెట్టు కాండం భాగంలో దుర్గమ్మ రూపం వెలిసింది. శ్రీసింహసహిత స్వయంభు దుర్గమ్మ వద్దకు నిత్యం వేలాది మంది భక్తులు వస్తున్నారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు రానున్నారు.

వానల్‌పాడ్ గ్రా మంలో ప్రతీ ఇంట్లో మహిళలు, పురుషులు, యువకులు భవానీమాల ధరించారు. వీరంతా నిత్యం రెండుపూటలా పూజలు చేస్తున్నారు. పాదరక్షలులేకుండా ఒంటి పూట భోజనం చేసి దుర్గమ్మ పూజల్లో పాల్గొంటున్నారు.



ముస్తాబైన ఆలయం

బాలుడి మృతిపై కుటుంబీకుల ఆందోళన



అయాన్స్ (ఫైల్)



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బంధువులు

ఖానాపూర్: వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఏడాదిన్నర బాలుడు మృతి చెందాడని ఆరోపిస్తూ బాధిత కుటుంబీకులు, బంధువులు ఖానాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన అనిత–రాజు దంపతుల నెలన్నర కుమారుడు అయన్స్‌కు జ్వరం రావడంతో ఈ నెల 21నుంచి 26వరకు ఖానాపూర్‌లోను మెడికేర్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పి చికిత్స అందించారు. చికిత్స సమయంలో బాలుడి చేతికి సెలైన్ పెట్టిన క్యానిల ప్రాంతంలో వాపు వచ్చి ఇన్‌ఫెక్షన్ అయింది. ఈ విషయమై వైద్యులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సమస్య తీవ్రమైంది. దీంతో 26న వైద్యుడి సూచన మేరకు నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినా పరిస్థితి విషమించింది. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో సోమవారం రాత్రి 11గంటల ప్రాంతంలో బాలుడు మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబీకులు, బంధువులు మంగళవారం మెడికేర్ ఆస్పత్రికి సిబ్బందిని నిలదీసి ఫర్నిచర్, రిషెప్షన్ కౌంటర్ ధ్వంసానికి యత్నించగా పోలీసులు, స్థానికులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న ఖానాపూర్, పెంబి, కడెం ఎస్సైలు రాహుల్ గైక్వాడ్, హన్మాండ్లు, సాయికిరణ్, సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. వారిని సముదాయించగా ఆందోళన సద్దుమణిగింది.

పండుగ పూట పస్తులేనా?

- నెలనెలా అందని వేతనాలు
- ఇంకా ఇవ్వని లాభాల బోనస్
- కాంట్రాక్ట్ కార్మికుల్లో ఆందోళన



ఎస్సార్పీ ఓసీపీ వద్ద ఆందోళన చేస్తున్న సీఆర్ఆర్ ఓబీ కాంట్రాక్ట్ కార్మికులు (ఫైల్)

శ్రీరాంపూర్: ‘ఒకే కుటుంబం.. ఒకే లక్ష్యం.. ఒకే గమ్యం’ అనే సింగరేణి నినాదం గోడలపైనే గాని ఆచరణలో కనిపించడంలేదు. వేతనాలు, లాభాల బోనస్ అందక ఎస్సార్పీ ఓసీపీ ఓబీ కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దసరా పండుగరోజు వారు పస్తులుండాల్సిన దుస్థితి దాపురించింది. ఓబీ పనులు నిర్వహించే సీఆర్ఆర్ కాంట్రాక్టర్ మూడు నెలలుగా 600 మంది కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదు. సెప్టెంబర్ 29న లాభాల బోనస్ డబ్బులు ఇస్తారనుకుంటే అవీ అందలేదు. ఈ దుస్థితికి కాంట్రాక్టర్, కంపెనీ అధికారులు బాధ్యత వహించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

నెలరోజులుగా ఆందోళన

సదరు కాంట్రాక్ట్ సంస్థ నాలుగేళ్ల కాలానికి ఓబీ పనుల టెండర్ దక్కించుకుంది. ఇంకా సుమారు 15నెలలు పని చేయాల్సి ఉంది. ఆగస్టు 26నుంచి పనులు నిలిపివేసింది. దీంతో కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేస్తున్నారు. మూడు నెలల వేతనం రావాల్సి ఉండగా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పది రోజులుగా ఆందోళన, ధర్నాలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

కంపెనీ బాధ్యత లేదా?


కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించకుంటే కంపెనీకి బాధ్యత ఉందా.. లేదా? అన్న చర్చ జరుగుతోంది. కాంట్రాక్ట్ లేబర్ యాక్ట్ సెక్షన్ 20, సబ్ సెక్షన్ 4 ప్రకారం ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా ఎవరైతే సింగరేణి అధికారులు ఉంటారో వారే ఈ వేతనాలు చెల్లించి తర్వాత కాంట్రాక్టర్ నుంచి వసూలు చేసుకోవాలి. దీన్ని కంపెనీ అధికారులు పట్టించుకోవడం లేదని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. కనీసం లాభాల బోనస్ ఇస్తేనైనా కొంత ఊరట ఉంటుందనుకుంటే అదీ చెల్లించడం లేదని వారు వాపోతున్నారు.

కాంట్రాక్టర్ స్పందించడం లేదు

సీఆర్ఆర్ కాంట్రాక్టర్ స్పందించడం లేదు. అతని బిల్లుల నుంచి డబ్బులు కట్ చేసి కార్మికులకు జీతాలు ఇద్దామనుకుంటే పనీ.. జరగలేదు. బిల్లులు పెండింగ్‌లో లేవు. కంపెనీకే అతను డీజిల్ ఫెనాల్టీలు చెల్లించాలి. ఎలాగైనా కనీసం లాభాల బోనస్ చెల్లించాలని చూస్తున్నాం. నేరుగా మేమే చెల్లించాలా, సదరు కాంట్రాక్టర్ ద్వారా చెల్లించాలా? అనే దానిపై అధికారులతో చర్చిస్తున్నాం.

– ఎం శ్రీనివాస్, జీఎం, శ్రీరాంపూర్


భూమిలిచ్చినందుకా ఈ శిక్ష



ఓసీపీ కోసం మా పంట భూమిలిచ్చినం. మాకు జీతాలు ఇవ్వక గోస పెడుతున్నారు. మూడు నెలలుగా జీతాలు లేకుంటే ఏం తిని బతుకుడో అధికారులే చెప్పాలి. కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వకుంటే సింగరేణి కాంట్రాక్టర్ టెండర్ డిపాజిట్ డబ్బుల నుంచైనా తీసి ఇవ్వాలి. వారూ పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు.

– ఐత కిష్టయ్య, ఓబీ కాంట్రాక్ట్ కార్మికుడు

పండుగ పూట కనికరం లేదా?



కనీసం పండుగ ఉందనే కనికరం కూడా కాంట్రాక్టర్లకు లేదు. ఏం తిని బతకాలే. పనికి నిమిషం ఆలస్యంగా వస్తే గగ్గోలు పెడతారు. మూడు నెలల నుంచి వేతనాలు రాకుంటే మేమేం చేయాలి. లాభాల బోనస్ కూడా ఇస్తారనుకుంటే అవి కూడా అందలేదు. కంపెనీ అధికారులూ మానవత్వంతో వేతనాలు ఇప్పించాలి.

– కొంతం రాజేందర్, ఓబీ కాంట్రాక్ట్ కార్మికుడు